ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 27 మే , 2025 | పేజీలు : 06

## సిపిఐ సూర్యాపేట పట్టణ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** సూర్యాపేట పట్టణ సిపిఐ కార్యదర్శిగా పట్టణానికి చెందిన బూర వెంకటేశ్వర్లు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం జరిగిన సిపిఐ పట్టణ నాలుగో మహాసభలో తనతో కలిసి 22 మంది కౌన్సిల్, 14 మంది పట్టణ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# 235 లైసెన్స్ సర్వేయర్లకి కిట్లు

### సేవా దృక్పధంతో విధులు నిర్వహించాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** సేవా దృక్పదంతో లైసెన్స్ సర్వేయర్లు విధులు నిర్వహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న భూముల సర్వే నిజాం కాలం నాటిదని ఆ సర్వే సహాయంతో లైసెన్స్ సర్వేయర్లు అప్డేట్ చేసుకుంటూ కచ్చితమైన మ్యాప్ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టం రూపొందించడం జరిగిందని, చట్టం అమలులో భాగంగా రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు భూముల మ్యాప్ పాస్ బుక్‌లో ప్రింట్ ఇవ్వటానికి భూములను సర్వే చేయుటకు లైసెన్స్ సర్వేయర్ల నుండి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడం జరిగిందని జిల్లాలో మొదటి విడత కింద 235 మంది అభ్యర్థులకి మే 26 నుండి జూలై 26వ తేదీ వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు అందరు యువతగా చురుకుగా పని చేస్తూ భూ సమస్యలని న్యాయబద్ధంగా పరిష్కరిస్తూ రైతుల పట్ల మంచి ప్రవర్తనతో మెలగాలని కలెక్టర్ సూచించారు. నిత్య జీవితంలో ఎన్ని మార్పులు, సాంకేతిక మార్పులు, కంప్యూటర్స్, ఇతర సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలు రోజు రోజుకు కొత్తగా వస్తున్నాయని, టెక్నాలజీ పెరుగుతున్నదని, ఎన్ని మార్పులు జరిగినా కూడా ఈ భూముల విషయంలో మాత్రం సహజంగానే అలాగే ఉన్నామని, రైతులు, ఈ భూముల వ్యవసాయం చేస్తేనే మనమంతా సుఖ సంతోషాలతో బ్రతుకుచున్నామని, అందుకే ఈ భూములను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ , ఎలాంటి గెట్టు తగాదాలు లేకుండా ఉండేందుకు గానూ, హద్దులను కాపాడేందుకు గానూ సర్వేయర్ల కొరత తీర్చేందుటకై రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి స్కీం ప్రారంభించిందని తెలిపారు. ఈ స్కీం ద్వారా భూముల లావాదేవీలు జరిగినప్పుడు సర్వే చేసి, హద్దులను నక్షాల్లో పొందుపర్చిన తర్వాత రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, దీని వల్ల తగాదాలకు చోటు ఉండదని కలెక్టర్ తెలిపా రు. నిరుద్యోగ యువకులు శ్రద్ధగా ఈ ట్రైనింగ్ పూర్తి చేసి రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 235 మందికి ట్రైనింగ్ ఇచ్చి, పరీక్ష పెట్టా పాయి అయిన వారికి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తదుపరి థిమరి ప్లాట్టింగ్, నోట్‌బుక్స్, కాల్యుకులేటర్, వృత్తిలేఖని, పెన్నులతో కూడిన కిట్టును కలెక్టర్ అభ్యర్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎస్‌ఎల్ ఆర్.శ్రీనివాసరెడ్డి, డిప్యూటి ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, ప్రకాశ్, సర్వేయర్లు శ్రీనివాస్, శ్యామ్, సమీర్, అలెన్, జోసెఫ్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నర్సాపూర్ కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు అవస్థలు

**ప్రజాపక్షం/నల్లగొండ (దామరచర్ల ):** పేద ప్రజల పక్షాన నిలబడి అనేక ప్రజా పోరాటాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. దామరచర్ల మండలం నర్సాపూర్ కాలనీలో సిపిఐ శాఖ మహాసభ డి శాంతా అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ఉద్యమాలతోనే పార్టీకి గుర్తింపు వస్తుందన్నారు. అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల పక్షాన ఉండి పోరాటాలు నిర్వహిస్తు ప్రజాసమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నర్సాపూర్ కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కాలనీలో ఏర్పాటు చేసిన కరెంటు స్థంబాలు శిధిలావస్థకు చేరాయన్నారు. వెంటనే ఆ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ధీరావత్ లింగ నాయక్,మండల సమితి సభ్యులు జమ్ముల కోటయ్య, పోలేపల్లి ఉదయ్,రాములు నిర్మల,సంప్లి హచ్చి,తులసియ్య,చెందబోయినశీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా ఘనవత నిర్మల,సహాయ కార్యదర్శిగా దస్తులు తోపాటు మరో ముగ్గురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# ఎప్పటికి పూర్తయ్యేనూ... అభివృద్ధి పనులు?

### ఏళ్ల తరబడి కొనసాగి ఆగిన పనులు...



**ప్రజాపక్షం/నందికొండ:** టియుఎఫ్ఐ,ఎస్ డి ఎఫ్ కు చెందిన 25 కోట్ల రూపాయల నిధులతో నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక హిల్ కాలనిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రత్యేకంగా నిర్మిస్తున్న వెజ్, నాన్ వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ ఒకటి. ఈ మార్కెట్ నిర్మాణ పనులు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్యరూపం దాల్చగా అప్పుడే ఈ పనులు మందకొడిగా సాగాయి. నేడు ప్రభుత్వం మారినా ఆ పనులు కొన్ని రోజులు నత్తనడకన కొనసాగి ప్రస్తుతం పూర్తిగా ఆగిపోయాయిcమార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగి నాలుగేళ్లు పూర్తికావస్తున్నా నిర్మాణ పనులలో జాప్యం,ఇప్పటికి పనులు ముందుకు సాగకపోవడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దాదాపు ఆరు సంవత్సరాల తరువాత నందికొండ నూతన మున్సిపాలిటీగా ఏర్పడింది. ఆ తరువాత నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో ఇచ్చిన హామీలో భాగంగా నందికొండ మున్సిపాలిటీ అభివృద్ధి పనులలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి అప్పటి బీఆర్ ఏస్ ప్రభుత్వం ఆమోదం తెలిపడం,వెంటనే ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థానిక డామ్ డివిజన్ కార్యాలయం ఎదురుగా ఎకరం స్థలాన్ని ప్రభుత్వం కేటాయించడం,ఆ తరువాత శంకుస్థాపన జరిపి పునాదులు వేయటం , వెంటనే నిర్మాణ,ప్రారంభ దశ పనులు చక చకా జరిగిపోయాయి రాను, రాను ఈ పనులు కాస్త నత్త నడకకు దారితీసి ఆ తర్వాత పనులు పూర్తిగా ఆగిపోవడంతో కాంప్లెక్స్ చుట్టూ కంప చెట్లు పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారయింది.

కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టిన మార్కెట్ కాంప్లెక్స్ చివరి దశ పనులు ఇలా అసంబద్ధంగా వదిలివేయడంతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.నిర్మాణ పనులు ఈ విధంగా కొనసాగక పోవటానికి ఈ విషయమై సంబంధిత అధికారులను అడిగితే నిధులు, కొరత, బడ్జెట్ లేదు అనే సమాధానం చెబుతున్నారు. గత మార్చి లో అప్పటి జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అభివృద్ధి పనుల నిర్వహణ పై సమీక్ష సమావేశం నిర్వహించడం, ఆ తరువాత గత జూన్ 26 న ఏర్పాటు చేసి న కౌన్సిల ర్ల సాధార ణ బడ్జెట్ సమావేశంలో నాలుగు కోట్ల 92 లక్షల రూపాయల వ్యయంతో 2024 25 ఆర్థిక సంవత్స రాంతానికి వ్యయం చేయవలసి ఉందని ఆరోజు బడ్జెట్ సమా వేశం నిర్ణయించింది. మరి ఆ నిధులను ఉపయోగించారా లేదా దుర్వినియోగం చేశారా అనేది తెలియడం లేదు దీనికి సంబం ధించిన పనులు వేగవంతంగా జరిగి ప్రారంభానికి నోచుకోవాలంటే అందుకు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిర్మాణ పనులలో జాప్యం జరగకుండా పనులు పూర్తి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## 108 సిబ్బంది అంతర్జాతీయ పైలెట్ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/భువనగిరి** : 108 అంబులెన్స్ వాహనాల విధి నిర్వహణ సిబ్బంది భువనగిరి 108 కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆపద అనగానే ముందుగా గుర్తుకొచ్చేది 108 అంబులెన్స్ పగలనక రాత్రి ప్రమాద సమయంలో రోడ్డు ప్రమాదాలలో క్షతగాత్రులను తరలించడంలో ముందు ఉంటారని 108 జిల్లా ఇన్చార్జి మహేష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పైలెట్ మహేందర్ రెడ్డి, రాకేష్, హీరోలాల్ అభిలాష్, సాలయ్య, సేవర్తి విశ్వం, శశికిరణ్, మహేష్, చిన్న కుమార్, సమీర్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండలంలోని తిమ్మపురం గ్రామంలోని నోముల రావీందర్ రెడ్డి తండ్రి నోముల సీతారాం రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కొమిరెల్లి నర్సిరెడ్డి, మండల పార్టీ ఉపధ్యక్షుడు గొడ్డేటి శ్రీను, తమ్మల మహేందర్ రెడ్డి, నర్సిరెడ్డి, మల్లయ్య గౌడ్, నర్సయ్య, నరసింహ రెడ్డి, బొంత రవి, మల్ల రెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూరెళ్ళలో బడిబాట

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం)** : మండలంలోని కూరెళ్ల గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ టీచర్స్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మిర్యాల దామోదర్ మాట్లాడుతూ మన ఊరు పాఠశాలలో అధిక సంఖ్యలో పిల్లలు చేర్పించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి డబ్బులు వృధా చేసుకోవద్దని, అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మన పాఠశాల భవిష్యత్తును కాపాడుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రమేష్, హై స్కూల్ ఉపాధ్యాయులు కొంతం శ్రీను, జానయ్య, వెంకన్న, సురేందర్, అండాలు, రామానుజమ్మ, రాజయ్య, ఏఎన్ఎం రాణి తదితరులు పాల్గొన్నారు.




## సిపిఐ మండల మహాసభ కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మునుగోడు:** ఈనెల 29వ తేదీన సింగారం గ్రామంలో జరిగే సిపిఐ మునుగోడు మండల 15 వ మహాసభ ను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం పిలుపునిచ్చారు.సోమవారం కొంపెల్లి గ్రామంలో పార్టీ నాయకులు కరపత్రం ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టజీవులకు ఎల్లప్పుడు ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వాలు మారిన పేదవాడి బ్రతుకులు మారడం లేదని పేర్కొన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని ప్రభుత్వం ఇచ్చే పథకాలను గ్రామాల వారీగా అధికారులు వివక్ష చూపకుండా నిజమైన పేదవాడికి అందే విధంగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బోల్గూరి నరసింహ, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి,బి.లాలు,మండల కార్యవర్గ సభ్యులు ఉప్పునుతల రమేష్,కొంపెల్లి గ్రామ శాఖ కార్యదర్శి వంకంటి వెంకటేశ్వరరావు, ముగుదాల యాదయ్య,దోకూరు మల్లారెడ్డి,ఏఐటియుసి మండల కార్యదర్శి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## బురదమయంగా ఉన్న బజార్లలో సిసిరోడ్ల నిర్మాణం చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొడ టౌన్:** పట్టణంలోని పానగల్లు రోడ్డులోని శ్రీనగర్ కాలనీలో బురదమయంగా ఉన్న ప్రధానమైన రోడ్లను సిమెంట్ రోడ్లుగా నిర్మాణం చేయాలని 2024 డిసెంబర్ నుండి ఇప్పటి వరకు విన్నవించిన ఫలితంగా 19వవార్డులో ఇప్పటికే కొన్ని సిసి రోడ్లనిర్మాణం జరిగినాయి. కానీ, బురదమయం గా ఉన్నటువంటి ప్రధానమైన రోడ్ల ను సిమెంట్ రోడ్లుగా వెంటనే నిర్మాణం చేయించాలని నల్లగొండ మున్సిపల్ మాజీ హ్యాట్రిక్ కౌన్సిలర్,కోఆప్షన్ సభ్యుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొండూరు సత్యనారాయణ కోరారు. గ్రీవెన్స్ డె సందర్భంగా శ్రీనగర్ కాలనీ పైభాగంలో ఉన్న ప్రధాన మంచి నీటి సమస్య పరిష్కారా నిక్ పైపు లైన్ వేయించాలని కాలనీవాసులతో కలసి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కు వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ వార్డు ప్రజావసరాల రీత్యా కౌన్సిల్లో గత కమీషనర్ మంజూరు చేసిన పనులను చేపట్టకుండా, మున్సిపల్ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ప్రస్తుత నల్లగొండ మున్సిపల్ కమీషనర్ పై అధికారుల ఆదేశాలు భేఖాతరు చేస్తున్నారని, ఇప్పటికైనా అట్టి పనులను వెంటనే చేయించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో 19వ వార్డు కాలనీవాసులు ఎం. కిషన్, ఎం. దశరథ, యాకాల వెంకన్న, నిమ్మనగోటి శ్రీను, జంపాల గిరి, కొండూరు గిరి, కవిత, క్రిష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహాలను కుటుంబాలకు ఇవ్వకపోవడం క్రూరత్వమే



**ప్రజాపక్షం/నల్లగొండ** : చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నారాయణపూర్ అడవులలో మే 21 న బూటకపు ఎన్కౌంటర్ లో మరణించిన తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పజెప్పకపోవడం కేంద్ర, రాష్ట్ర( చత్తీస్‌గఢ్) ప్రభుత్వాల యొక్క క్రూరత్వానికి నిదర్శనమని ప్రజా సంఘాల నేతలు అన్నారు.మృతదేహాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అమానవీయ ఘటనను నిరసిస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవన్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల బాధ్యులు మట్టి మనిషి వేనపల్లి పాండురంగారావు మాట్లాడుతూ రాజ్యం శవాలను చూసి కూడా వనికి పోతుందని, చనిపోయిన మృతదేహాలు కూడా పాలకులను భయపెడుతున్నాయంటే వారు ఎంత శక్తివంతులో ప్రజలు, సమాజం గమనించాలన్నారు.గుజరాత్ లో ప్రారంభించిన నరమేదాన్ని దేశం మొత్తం వ్యాప్తి చేస్తున్నారని అంధోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ శవాలను బంధువులకు కుటుంబాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల బాధ్యులు సుధాకర్ రెడ్డి,పందుల సైదులు, రామయ్య, జానకిరామ్ రెడ్డి, పన్నాల గోపాల్ రెడ్డి,పాలడుగు నాగార్జున,కోమటిరెడ్డి అనంతరెడ్డి,,తోట నరసింహచారి,మోతుకూరి శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్,యాదగిరి రెడ్డి పాల్గొన్నారు.

## బిసిలకు సముచిత స్థానం కల్పించాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో బీసీలకు సముచిత స్థానంల కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలను రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తూ ప్రస్తుతం ఉన్న అన్ని శాఖల్లో అగ్రవర్ణాలకే పెద్దపీట వేస్తుందన్నారు. ఇప్పటికైనా త్వరలో జరిగే నూతన మంత్రివర్గ విస్తరణలోనైనా బీసీలకు సముచిత స్థానం కల్పించి బీసీ వర్గాలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దాసరాజు జయరాజు, మహేష్‌గౌడ్, సురేష్‌యాదవ్, గంగాధర్, ఉపేందర్, రవీందర్‌నాయక్, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/భువనగిరి** : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య అన్నారు. సోమవారం భువనగిరి మండల పరిధిలోని నందనం, అనాజిపురం గ్రామాల్లోని ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ 2005లో అనేకమంది వ్యవసాయ కార్మికులు వామపక్ష పార్టీ ప్రజా సంఘాల పోరాట ఫలితంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఏర్పడితే నేటి బిజెపి మోడీ ప్రభుత్వం చట్టాన్ని ఎత్తివేయాలను కుంట చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా కమిటీ సభ్యులు కొండపురం యాదగిరి, రైతు సంఘం జిల్లా నాయకులు ఎదునూరి మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉపాధి హామీ కార్మికులు కొల్లూరి సిద్ధిరాజు, సురివి పద్మ, అల్లంపల్లి భారతమ్మ, కడారి మల్లయ్య, బొల్లెపెల్లి బుచ్చమ్మ, సుగుణమ్మ, అంసమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండల పరిధిలోని వెల్వర్తి గ్రామానికి చెందిన నిజం రిపోర్టర్ కూచిమల్ల నాగేష్ మాతృమూర్తి కూచిమల్ల లక్ష్మమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న ఏజీఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సౌజన్యంతో సమకూర్చిన రూ.10,000 లను వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు వారి కుటుంబానికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మారగోని శ్రీనివాస్ గౌడ్, అధ్యక్షులు బాలగోని హనుమంత్ గౌడ్, సభ్యులు బోడిగే సుదర్శన్ గౌడ్, రెబ్బ కుమారస్వామి, బలుగూరి వెంకట్ రెడ్డిదేశ, దేశబోయిన కృష్ణ స్వామి, నీలం నరేందర్, సంగిశెట్టి విజయ్ కుమార్, దంతూరి నరేష్, మార్కా భగవంతు, వీసం రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా నియమించాలని వినతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడిగా తనను నియమించాలని కోరుతూ 35వ వార్డు మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పట్టణ అభివృద్ధికి కోసం తాను నిరంతరం పాటుపడుతున్నానని, ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటు గత 20 సంవత్సరాలుగా అంబేద్కర్ యవజన సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్నానని అన్నారు.

## కూల్ డ్రింకులు ఆరోగ్యానికి హానికరం



**ప్రజాపక్షం/వేములపల్లి:** నూనెలు,కూల్ డ్రింక్స్ జనరిక్ మెడిసిన్ ఆరోగ్యానికి హానికరమని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గుత్తికొండ సుదర్శన్ రెడ్డి అన్నారు.సోమవారం ఆమనగల్లు గ్రామంలోని ఉపాధి హామీ కూలీలకు వేసవి జాగ్రత్తలు గురించి వివరించారు.మూఢనమ్మకాల పట్ల అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు గుత్తికొండ సత్యనారాయణ రావు,ఉపాధి హామీ కూలీలు తదితరులు ఉన్నారు.

## నేడు చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/నిడమానూరు:** 27న నిడమానూరు తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో నాగార్జునసాగర్ శాసనసభ్యుడు కుందూరు జయవీర్ రెడ్డి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు నిడమనూర్ తాసిల్దార్ జంగాల కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం తెలియజేశారు, కార్యక్రమానికి సకాలంలో ప్రజా ప్రతినిధులు మండలంలోని అన్ని గ్రామాల లబ్ధిదారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

## వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జున సాగర్ హిల్ కాలనిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వైన్స్ ప్రసాద్ కుమారుడు నందకిషోర్ శ్రావణి వివాహ కార్యక్ర మంలో భాగంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని పురస్కరించుకొని ఆ కార్యక్రమానికి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆశీర్వదించిన వారిలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , మాజీ మంత్రి కుం దూరు జానా రెడ్డి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి , మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మ రెడ్డి , ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ జెడ్పిటిసి కర్నాటి లింగారెడ్డి, జడ్పిటిసి భగవాన్ నాయక్ లు ఉన్నారు.

## సంస్థాగతంగా సిపిఐని బలోపేతం చేయడమే లక్ష్యం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** సంస్థాగతంగా సిపిఐ పార్టీని బలోపేతం చేయడమే మహాసభల లక్ష్యమని ఆ పార్టీ కౌన్సిల్ మెంబర్ భీమగాని నరసింహ అన్నారు. పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో ఆయన అధ్యక్షతన గ్రామ శాఖల మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. మండల మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి గోదల్ల నాగభూషణం, గీత పనివారల సంఘం ప్రధాన కార్యదర్శి పబ్బు యాదయ్య, కృష్ణమూర్తి, గణేష్ శ్రీశైలం, శివ తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల బ్రదర్స్ ఆర్థికసాయం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి సోమయ్య ఇటీవల మరణించడంతో సోమవారం వారి కుటుంబానికి కృష్ణరెడ్డి ప్రోద్బలంతో ఆలేరు యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గద్వాల ఉపేందర్ రూ. 5వేలను ఆర్థిక సాయంగా అందించారు.



# పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడి

**ప్రజాపక్షం/నిడమనూరు:** రైతులు పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని కంప సాగర్ వ్యవసాయ క్షేత్ర శాస్త్రవేత్తలు డాక్టర్ లింగయ్య, డాక్టర్ శ్రీధర్ లు రైతులకు సూచించారు, ప్రొఫసర్ శివ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల అవగాహన కార్యక్రమం లో భాగంగా నిడమనూరు మండల వ్యవసాయ అధికారి ఎం మునికృష్ణ అధ్యక్షతన సోమవారం మండల పరిధి శాఖాపురం గ్రామంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ యూరియా, క్రిమి సంహారక మందుల వాడకాన్ని అవసరం మేరకు వాడడం తో పాటు, పచ్చి రొట్ట పంటల సాగు ద్వారా పెట్టుబడి ఖర్చును తగ్గించడం తోపాటు నేల నాణ్యత దెబ్బతినకుండా ఉంటుందని వారు అన్నారు, సాగు నీటిని కూడా పొదుపుగా వాడాలని మొక్కలు



పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునన్నారు, రైతులు, విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసిన రసీదులను భద్రపరచుకోవడం ద్వారా కష్ట కాలంలో నష్టపరిహారాన్ని పొందవచ్చునని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి సుధాకర్ నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి విజయచంద్ర, రైతులు సూర్యనారాయణ రామకృష్ణ పలువురు రైతులు పాల్గొన్నారు.

# బెల్లి లలితక్క విగ్రహం ట్యాంక్‌బండ్‌పై పెట్టాలి





**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బెల్లి లలితక్క విగ్రహం ట్యాంక్ బండ్ పై పెట్టాలని శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట విరేష్ యాదవ్ అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమ గాన కోకిల బెల్లి లలితక్క 26వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో అమరవీరుల స్థూపం వద్ద శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గణ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట విరేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఆట పాటలతో తెలంగాణ భావజాలన్నీ ఊరురా వ్యాప్తి చేసి ప్రజలని చైతన్య పరచి, తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసి ప్రాణాలు అర్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డోల్ దెబ్బ రాష్ట్ర కన్వీనర్ బెల్లి చంద్రశేఖర్ యాదవ్, బెల్లి లలితక్క కుమారుడు బెల్లి సూర్య ప్రకాష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ యాదవ్, జిల్లా కో ఆర్డినేటర్ అవిశేటి రమేష్ యాదవ్, బీరు రమేష్, వెన్నెల యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు తెల్జురి శ్రీశైలం యాదవ్, భువనగిరి మండల యూత్ ప్రధాన కార్యదర్శి శ్రీరాం శరత్ యాదవ్, బీబీనగర్ మండల యూ త్ అధ్యక్షులు పర్వతం రంజిత్ యాదవ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వలిగొండ :** తెలంగాణ ప్రజా ఫ్రంట్ వలిగొండ మండల అధ్యక్షులు రాపోలు పవన్ కుమార్ ఆధ్వర్యంలో బెల్లి లలిత 26వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ బట్టు రామచంద్రయ్య మాట్లాడుతూ ఆనాడు దగా పడ్డ తెలంగాణ కోసం ఎంతో ఉద్యమించిన బెల్లి లలిత నర హంతకులు 17 ముక్కలుగా నరికి హత్య చేశారని ఆనాటి పరిస్థితి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ సభ్యులు కావలి యాదయ్య, ప్రధాన కార్యదర్శి రసాల నరసింహ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దుబ్బ దానయ్య, బీసీ సంఘం నాయకులు సాయిని యాదగిరి, టిపిఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి మల్లారెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.ం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** తెలంగాణ ఉద్యమకారిని, గాన కోకిల బెల్లి లలిత 26వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ రాజారాం యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం తన ప్రాణాలు అర్పించిన బెల్లి లలిత ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె తెలంగాణ కోసం ఆటపాటతో ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గొర్రెల మేకల కాపరుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెబోయిన అయోధ్య యాదవ్, కోనపూరి కవిత మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలయ్య, మంగ అశోక్, పర్వత శ్రీశైలం పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన రమేష్‌నాయక్



**ప్రజాపక్షం/డిండి;** డిండి పట్టణ కేంద్రంలో సోమవారం జరిగిన వివాహ కార్యక్రమంల బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. బిఆర్ఎస్ డిండి పట్టణ యువజన అధ్యక్షులు రషీద్, మైనార్టీనాయకులు పీర్ మహమ్మద్, బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు సురేష్ పాల్గొన్నారు.





## నర్సిరెడ్డి మృతి బాధాకరం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మండలంలోని నెమ్మాని గ్రామ తాజా మాజీ సర్పంచ్ గంట్ల నర్సిరెడ్డి అకాల మరణం బాధాకరమని తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ, సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి గురైనారు. సోమవారం నెమ్మాని గ్రామంలో నర్సిరెడ్డి మృతదేహానికి ఆయన పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నర్సిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, పట్టణ అధ్యక్షుడు జెర్రిపోతుల భరత్ గౌడ్, జిల్లా నాయకులు వడ్డె భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మండలంలోని నెమ్మాని గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ గంట్ల నర్సిరెడ్డి అనారోగ్యంతో మరణించగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయన మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి



**ప్రజాపక్షం/డిండి;** ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని డిండి జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు పాపిరెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇల్లు ఇల్లు తిరిగి తల్లిదండ్రులకు వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కోరారు. ఈసందర్భంగా డిండి జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు పాపిరెడ్డి, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో తల్లిదండ్రులను చైతన్యం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతయ్య, యాదయ్య, సత్యనారాయణ, రహమత్‌ఖాజా, సుజాత, సరోజ, సుజల, పావని, వెంకన్న, ధనమ్మ, నవనీత, లివీన, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, తల్లుల కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం చేపట్టొద్దని హైకోర్టు స్టే



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మసాన్‌పల్లి గ్రామానికి చెందిన బొంత కృష్ణయ్య కు చెందిన 111 గజాల ఇంటి స్థలంలో గ్రామానికి చెందిన రాజకీయ నాయకులు ఆక్రమించుకొని బస్టాండ్ నిర్మిస్తున్నారని తనకు న్యాయం చేయాలని బాధితుడు కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించగా జస్టిస్ టి. మాధవి దేవి స్పందించి నిరుపేద అయిన కృష్ణయ్య స్థలంలో ఎలాంటి ఆక్రమ కట్టడాలు నిర్మించొద్దంటూ స్టే ఆర్డర్ ఇవ్వడంతో స్థానిఎ ఎంపివో ధనుంజయ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజులు సోమవారం కృష్ణయ్య ఇంటి స్థలాన్ని పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.

# అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలి

## నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై సమీక్షిస్తూ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా పంపించిన రైతు ఆత్మహత్యల జాబితా మరియు ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన వితంతు పెన్షన్ కుటుంబాల జాబితా ఆధారంగా జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హుల జాబితాను రూపొందించాలన్నారు.జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద లబ్ధి పొందేందుకు సంబంధిత తహసిల్దార్ కి దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని,దరఖాస్తు తో పాటు, ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల ధ్రువ పత్రం, మరణ దృవీకరణ పత్రం, బ్యాంకు పాసు బుక్ జిరాక్స్, సహజమరణమా లేక ప్రమాద వశాత్తు సంభవించిన మరణమా అని తెలిపే అఫిడవిట్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీ, ఐకెపి ద్వారా ఏ ఏ బి వై, జె బి వైకి సంబంధించి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

**ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి**

ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిలిత సమావేశంలో ఇందిరమ్మ ఇండ్లు, దర్తి ఆబా యోజన, జూన్ 2 న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు, పౌరసరఫరాలు తదితర అంశాలపై సమీక్షించారు.ముఖ్యంగా వచ్చే వానకాలం రైతులను ప్రత్యామ్నాయ పంటలతో పాటు, అంతర పంటలవైపు ప్రోత్సహించాలని, ఆ విధంగా ప్రణాళిక రూపొందించాల్సిందిగా వ్యవసాయ శాఖ జిల్లా అధికారిని ఆదేశించారు. జూన్ 2న నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథి సందేశానికి ఆయా శాఖల అధికారులు వెంటనే వారి శాఖలకు సంబంధించిన నోట్స్ ను చేయాలని ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలని ఆదేశించారు. వేడుకల సందర్భంగా అవసరమైన ఇతర అన్ని ఏర్పాట్లను చూడాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్తీ ఆభా యోజన కింద కింద పెండింగ్లో ఉన్న ప్రతిపాదనలు సమర్పించాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన జాబితాను అప్డేట్ చేయాలని చెప్పారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇన్చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్చార్జి డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి ,డిఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ ,ఇతర అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

# బొడ్రాయి (నాభిశిల) కార్యక్రమంలో నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని కోరుట్ల గ్రామంలో గ్రామ ప్రజలు నిర్వహించిన బొడ్రాయి (నాభిశిల) కార్యక్రమంల సోమవారం పిసిసి సభ్యులు, పిఏసిఎస్ చైర్మన్ జాలే నర్సింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడి పంటలత సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు గ్రామ ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. మాజీ ఎంపిపి పార్వతి, కోరుట్ల వెంకన్న, గణేష్, గోపికృష్ణ, తిరుపతి, హరీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, మాజీ సర్పంచ్ బాలునాయక్, అంజయ్య, సత్తిరెడ్డి, మధు, కార్తీక్, వెంకులు పాల్గొన్నారు.

# జననీయాత్రను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ :** పిల్లలు లేని దంపతులకు అధునాతన సంతాన సౌకర్య పరిష్కారాల కోసం ఓయాసిస్ ఫర్టిలిటీ ఆధ్వర్యంలో నల్లగొండలో జననీ యాత్ర చేపట్టడం అభినందనీయమని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్జీ కళాశాల ఆవరణలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ఖయ్యూం బేగ్ తో కలిసి జననీ యాత్రను ప్రారంభించారు. అనంతరం గుమ్ముల మాట్లాడుతూ పిల్లలు కాని దంపతులు ఆర్ఎంపి కలవడం, ఆ తర్వాత మందులు వాడుతున్నారని పేర్కొన్నారు.మనకు ఉన్న సమస్యలు లోపం కాదని, ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని వివరించారు.పిల్లలు పుట్టని దంపతులను బయటి వారితో పాటు కుటుంబ సభ్యులు కూడా వేధిస్తారని, అవమాన పరుస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ దగ్గరికి వెళ్తే లోపాన్ని గుర్తించి నీ కలలను సహకారం చేసుకోవచ్చని సూచించారు. అమ్మానాన్నలవ్వాలని ఆశ దిశగా పిల్లలు పుట్టనీ దంపతుల కోసం నల్లగొండలో జననీ యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు.మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్‌లు మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు ఎంతో మానసిక వేదనకు గురవుతారని పేర్కొన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇలాంటి వారికోసం ఓయాసిస్ ఫర్టిలిటీ ఆధ్వర్యంలో జననీ యాత్ర చేపట్టడం హర్షనీయమన్నారు. ఓయాసిస్ ఫర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ సాయి మానస దార్ల మాట్లాడుతూ సంతానలేమి అనేది ఒక వైద్యపరమైన అంశం మాత్రమే కాదని పెరిగిపోతున్న జీవనశైలి సంబంధిత ఆందోళన కూడా అని వివరించారు.



# మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలి

## వామపక్ష, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** చత్తీష్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 27 మంది మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు అప్పగించాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. చత్తీష్‌ఘడ్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27 మందిని ఎన్‌కౌంటర్ చేయడాన్ని వామపక్ష , ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. చర్చలకు తాము సిద్దమేనని మావోయిస్టులు పదేపదే చేసిన విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం, చత్తీష్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టి అమానవీయంగా మావోయిస్టులను తుడిచిపెట్టే విధానాన్ని అనుసరిస్తున్నాయని అన్నారు. ప్రధాని, హోంమంత్రి ప్రకటనలు, ఎన్‌కౌంటర్‌పై హర్షం వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్దమన్నారు. అనేక రాజకీయ పార్టీలు, సంఘాలు, సంస్థలు మావోయిస్టులతో చర్చలు జరిపి విషయాన్ని పరిశీలించాలని పలు విజ్ఞప్తులు చేశాయన్నారు. మావోయిస్టు రాజకీయాలతో భిన్నాభిప్రాయం ఉన్నప్పటికీ వారితో వెంటనే చర్చలు జరపాలని, పారామిలటరి దాడులను ఆపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చత్తీష్‌ఘడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సెట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కోరారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలన్నారు. అటవి సంపద, ఖనిజాలు, వనరులు, భూమిని, అంబాని, అదాని వంటి కార్పోరేట్ సంస్థల అధిపతులకు అప్పగించడం కోసమే అపరేషన్ చేపట్టిందని విమర్శించారు. శాంతిభద్రతల సమస్యగా సృష్టించి బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నారని అన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కర్త సమస్యగా పరిగణించి చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ప్రజలంతా ఉద్యమించాలని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, న్యూడెమోక్రసి జిల్లా నాయకులు కుసుకుంట్ల సైదులు, సామాజిక అధ్యయన వేదిక కో కన్వీనర్ రేపాక లింగయ్య, బహుజన మహాసభ రాష్ట్ర కమిటి సభ్యులు నారబోయిన వెంకట్‌యాదవ్, నాయకులు మట్టపల్లి సైదులు, బొడ్డు శంకర్, యోగానందచారి, మండడి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎం సామ్యనాయక్ సస్పెన్షన్

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సామ్యనాయక్‌ను సోమవారం నల్గొండ జిల్లా డిఈవో బిక్షపతి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత సంవత్సర కాలంగా పాఠశాలకు గైర్హజర్ అవుతున్నా తప్పుడు సమాచారం అందించిన గాగిలాపురం హెచ్‌ఎం వేణుమాధవ్‌ను కూడా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఉద్దేశ పూర్వకంగానే విధులకు ఆటంకం కలిగించడంతో వారిని సస్పెండ్ చేసినట్లు డిఈవో తెలిపారు.

# కలుషిత నీరు తాగొద్దు



**ప్రజాపక్షం/ఎర్రవల్లిః** వర్షకాలం రాబోతుంది కావున ప్రజలు చెట్ల కింద ఉండకుండా పిడుగుల బారిన పడకుండా సురక్షితంగా ఉండాలని వివరిస్తున్న ప్రభుత్వ కళాకారులు. కలుషితమైన నీళ్లు తాగకండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆటపాటలతో ప్రజలకు వివరిస్తున్న జోగులాంబ గద్వాల జిల్లా సాంస్కృతిక సారధి ప్రభుత్వ కళాకారులు. ప్రస్తుత వానకాలం కావున భారి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశువులను పొలాల దగ్గర చెట్ల కింద ఉంచకుండా సురక్షితమైన ప్రదేశాలకు చేర్చి మనం సాదుకున్న జంతువులను కూడా కాపాడుకోవాలని వర్షాల కురుస్తున్న సమయంలో చెట్ల కింద ఉండకుండా పిడుగుల బారిన పడి ప్రాణాలకు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ ఉద్యోగులు పాటల రూపంలో డప్పు కొడుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామంలో కళాకారులు రమాదేవి, కేశవులు, భూపతి, హజరత్, స్వామి, కవిత, కృష్ణ, ప్రజలకు వర్షకాలంలో తగు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

# నేడు ధర్మవరంలో ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/ఎర్రవల్లిః** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ధర్మవరం గ్రామంలో మంగళవారం అమావాస్య సందర్భంగా లక్ష్మి చెన్నకేశవ స్వామికి అభిషేకం శ్రీ ఆంజనేయ స్వామికి ఉదయం ఆకుల పూజ జరగనున్నట్లు గ్రామ ప్రజలు స్థానిక అర్చకులు తెలియజేశారు. అదే విధంగా భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించగలరని తెలియజేయడం జరిగింది. అలాగే మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుంది. గ్రామంలో అందరు వచ్చి భోజనం చేసి పోగలరని కోరుచున్నారు.

# ప్రజావాణిలో 8 ప్రజా సమస్యలపై పిటిషన్ దరఖాస్తులు



**ప్రజాపక్షం/మానవపాడుః** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తలు రామ్ ప్రసాద్‌రెడ్డి శాంతకుమార్ మాట్లాడుతూ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ మా మండలంలో జల్లాపురం గోకుల పాడు కొర్విపాడు గ్రామాలకు నూతన బిటి రోడ్డు పనులు నిమిత్తం కొరకు టెండర్లు జరుగలేదు. అలాగే మా జల్లాపురం గ్రామంలో పల్లె దవాఖానా నిర్మాణం చేసి రెండు సంవత్సరాలు అయినా నేటికి ప్రారంభం కాలేదు, స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్న ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి కమ్యూనిటి లేక పోవడంతో నూతన సమస్య బిసి బ్రహ్మంగారి కాలనిలో ఎన్నో ఏండ్ల కింద నివసించే ప్రజలకు ఎలాంటి ప్రాణాపాయం జరగకముందే లైన్ పూర్తిగా తొలగించే విధముగా ఇదే గ్రామంలో ఎస్సీ మాదిగ స్మశాన వాటికలో మనిషిని పూడ్చిన తర్వాత మట్టి చేతులను బట్టలకు తుడుసుకోవాల్సింది తప్ప నీటి సౌకర్యం లేదు ఈ స్మశాన వాటికలో చేతి బోరు పంపు ఏర్పాటు చేస్తూ మిగిలిన ప్రజా సమస్యలపైన పిటిషన్ దరఖాస్తులను సమర్పించడం జరిగిందన్నారు. సామాజిక కార్యకర్తలు శాంతకుమార్, రామ్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలసదనం సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** బాలసదనం సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. సోమవారం గ్రీవెన్స్ డే పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి 40 విజ్ఞప్తులు ఫిర్యాదులు స్వీకరించారు. అందులో కొన్ని ఇలా ఉన్నాయి. భువనగిరి జిల్లాకు చెందిన బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు కొడారి వెంకటేష్ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు అందిస్తూ జిల్లాలో ఉన్న బాలసదనం సమస్యలతో అస్తవ్యస్తంగా ఉందని సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తిని అందించారు. బీబీనగర్ మండలం మహాదేవపూర్‌కు చెందిన వేణుగోపాల స్వామి టెంపుల్ చైర్మన్ శివారెడ్డి దరఖాస్తు అందిస్తూ ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని భక్తుల రాకకు కెమికల్ కంపెనీ విడుదల చేసే నీరు, గాలి అసౌకర్యం కలిగిస్తున్నాయని తగు చర్యలు తీసుకోవాలని ఆలయ చైర్మన్ శివారెడ్డితో పాటు ప్రభాకర్, స్వామి రెడ్డి, ఆంజనేయులు, పద్మా రెడ్డి, కరుణాకర్ రెడ్డి, అఖిల్, రాములు విజ్ఞాపన అందజేశారు. మోట కొండూరు మండలం సింగారం గ్రామానికి చెందిన పన్నాల అనూష దరఖాస్తు అందిస్తూ సర్వే నెంబర్లు 215/1, 215/5, 212/1, 214/1, 214/4 లలో 14 ఎకరాల భూమి ఉందని, సర్వే కొరకు చాలానా కూడా కట్టి నాలుగు సంవత్సరాలు అయిందని అయినా ఇప్పటివరకు సర్వే చేయడానికి రావడం లేదన్నారు. పోచంపల్లి మండలం జిబ్లగ్‌పల్లికి చెందిన సయ్యద్ సుల్తానా భర్త చాంద్ పాషా తన దరఖాస్తు అందిస్తూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినా ముగ్గు పోయడానికి రాలేదని తమకు కారణాలు తెలియవని తగు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డుకు చెందిన ఎడ్ల నరసమ్మ దరఖాస్తు అందిస్తూ తనకు అర్హత ఉన్న ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పర్యవేక్షించాలని, వెంటనే సమాధానం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈవో శోభారాణి, డిఆర్‌డిఓ నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిని సునంద, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా తరలిస్తున్న మట్టి




## రియల్ ఎస్టేట్ ప్లాట్‌లకు తరలింపు

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** అల్లంపూర్ చౌరస్తా సమీపంలో చుట్టూ 20 కిలోమీటర్ల పరిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అనుకుని రియల్ ఎస్టేట్ ప్లాట్లకు ఎటువంటి అనుమతి లేకుండా మట్టి తరలింపు కొనసాగుతుంది. రాత్రి పగలు ఎడతెరిపి లేకుండా 44వ జాతీయ రహదారికి అనుకుని ఉన్న ప్లాట్‌లకు డిమాండు బాగా పెరిగింది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి ప్లాట్లను ఏర్పాటు చేసుకుని విక్రయాలు కొనసాగిస్తున్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. అలంపూర్ చౌరస్తాలోని ఒక వ్యక్తి మట్టి దందా వ్యాపారం చేస్తున్నాడు. కర్నూలు నుంచి టిప్పర్లు ఏర్పాటు చేసుకుని ఇక్కడ మట్టి అవసరము ఒప్పందం కుదుర్చుకుని మట్టి దందా వ్యాపారం నడుపుతున్నాడు ఎర్ర మట్టిని మంచి డిమాండు ఉండడంతో టిప్పరు ఒక ట్రిప్పు 5000 వేల వరకు తీసుకునే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు పుట్టగొడుగు లాగా పుట్టుకోస్తున్నారు. కొత్త కొత్త పేర్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఏర్పాటు చేసుకుని ప్లాట్ల వ్యాపారాలు ఇండ్ల నిర్మాణాలు చేపట్టి అమ్మకాలు చేస్తున్నారు. పోలీసు రెవెన్యూ మైనింగ్ అధికారులు తెలిసిన పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. అధికారులను తెలిసిన ఏమి చేయలేరని, ధీమాతో మట్టి వ్యాపారస్తులు తమ ఇష్టం వచ్చినప్పుడు అవసరం ఉన్నప్పుడు తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు.

# నిరుద్యోగ యువతకు అండగా నిలిచాం



**-జాబ్‌మేళా విజయానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు**
**-ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**

**ప్రజాపక్షం/వైరా:** ఈ నెల24న వైరాలో జరిగిన మెగా జాబ్‌మేళాను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ శనివారం నాడు జరిగిన మెగాజాబ్ మేళా విజయవంతం అయిందని అందులో భాగంగా సెవెంత్ నుంచి డిగ్రీ బిటెక్ , బి ఫార్మసి, ఐటిఐ ఎం ఫార్మసి , ఇంటర్, డిగ్రీ తదితరులు చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించే కార్యక్రమంలో భాగంగా 90 కంపెనీలతో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేశామని, దానికి గాను ముఖ్య అతిధిగా డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాకు నిరుద్యోగులకు కల్పించిన అవకాశానికి ఆన్‌లైన్ ద్వారా 9400, ఆన్‌లైన్ ద్వారా 3000 మొత్తం 12400 నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. శనివారం జరిగిన మెగా జాబ్‌మేళాలో హాజరై 8889 మంది ఇంటర్వ్యూకి హాజరయ్యారు. అందుకు తొలి విడతగా 2504 కి ఆ రోజు విడతగా నియామక పత్రాలు అందజేశారు. రెండో విడతగా 1540 మంది నియమితులయ్యారు. మొత్తం 4040 మందికి నియామక పత్రాలు చేయడం జరిగింది. అందుకు ఈ కార్యక్రమం విజయవంతం చేసినందుకు కాంగ్రేస్ నాయకులకు, అధికారులకు, పోలీస్ వారికి లయన్స్‌క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. వచ్చిన వారికి కమిటీ నియమించి వచ్చినా నిరుద్యోగులకు వారి వెంట వచ్చిన తల్లిదండ్రులకు మజ్జిగ, వాటర్, భోజనం వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, శెట్టిపల్లి సూతకాని జైపాల్, మండల కాంగ్రేస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, టౌన్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, దొడ్డా పుల్లయ్య, రాంపూడి రోశయ్య, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, ఫణితి శ్రీను, సూరంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలను ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** రైతులకు నాణ్యమైన విత్తనాలను సరసమైన ధరలకే విక్రయించాలని , లేని పక్షంలో అవినీతికి పాల్పడిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయధికారి గౌతమ్ ఫర్టిలైజర్ డీలర్లను హెచ్చరించారు. సోమవారం మండలంలోని అమ్మనబోలు గ్రామంలోని మనగ్రోమోర్ సెంటర్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లైసెన్స్ పొందిన అధీకృత డీలర్స్ వద్దనే కొనుగోలు చేయాలని, అధేవిధంగా కొనుగోలు చేస్తున్నప్పుడు తప్పనిసరిగా రశీదు పొందాలని , అట్టి రశీదును ఆ విత్తన ప్యాకెట్‌లను సీజన్ ముగిసే వరకు భద్రపరుచుకోవాలని రైతులకు ఆయన సూచించారు. డీలర్లు రైతులకి తప్పనిసరిగా నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పి ధరలకు మించి విత్తనాలు , పురుగుల మందులు , ఎరువులు అమ్మకూడదని తెలిపారు. నకిలీ విత్తనాలు గ్రామాల్లో అమ్ముతున్నట్లు తెలిసిన వ్యవసాయ శాఖ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

# నిబంధనలను తుంగలో తొక్కి యధేచ్ఛగా కొబ్బరికాయల విక్రయాలు

**-చెర్వుగట్టులో అధికారుల నిర్లక్ష్య వైఖరి**

**-విద్యార్థి నాయకుడు నవీన్ ఆవేదన**

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** తెలంగాణ లోనే అత్యంత ప్రాచుర్యం పొందిన అమావాస్య క్షేత్రం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీపార్వతి జడల రామలింగేశ్వర దేవస్థానంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై భక్తుల్లో తీవ్ర ఆవేదన నెలకొన్నదని మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు వాడపల్లి నవీన్ తీవ్రంగా విమర్శించారు. ఆలయ పరిశుభ్రతలోను నిర్లక్షం, గుట్టపైకి వెళ్లే దారిలోని ట్రాఫిక్ సమస్యలను సైతం నిర్లక్షం వ్యవహరించడంతో పాటు 2025 మే 15 తారీఖున రూ.19 లక్షలు చెల్లించకపోవడంతో ఆలయ అధికారులు సదరు కొబ్బరికాయల హక్కుదారుని ఆలయ సంబంధిత కార్యకలాపాల నుంచి తొలగిస్తూ దేవాస్థాన అధికారులు సీజ్ చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సోమవారం ఆలయ ఈవోను కలిసి అవినీతి అక్రమాలపై అధేవిధంగా సమస్యలను పరిష్యరించాలని అవినీతి అక్రమాల నుండి దేవస్థానాన్ని కాపాడాలని విద్యార్థి నాయకుడు వినతి పత్రాన్ని అందించేందుకు వెళ్లిన నిరాశ ఎదురైందని ఆయన వాపోయారు. సంబంధిత అంశంపై ఆలయ సిబ్బంది విక్రయించాల్సిన కొబ్బరికాయలను అదే వ్యక్తి యధేచ్ఛగా విక్రయిస్తుండడాన్ని గతంలో అనేక సార్లు ఈవో దృష్టికి తీసుకెళ్లినప్పటీకి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. సాక్ష్యాధారాలతో సహా పూర్తి వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ కోరతామని బాధితులు తెలిపారన్నారు. ఆలయ ఆస్తుల దుర్వినియోగం , నిర్వాహకుల నిర్లక్ష్యం వంటి విషయాలపై చర్యలు తీసుకోవాలని భక్తులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి విషయంపై ఫోన్ చేస్తున్న ఎత్తడం లేదని నవీన్ ఆవేదన వ్యక్తం చేస్తూ ఇట్టి వ్యవహారంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోల్సిందిగా పలువురు కోరుతున్నారు.

# కిలాడి లేడీ అరెస్ట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఐఏఎస్ అధికారిణంటూ పలు చోట్ల మోసాలకు పాల్పడుతున్న కిలాడి లేడిని మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిచారు. సీఐ మోతీరాం తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం లావూడితండాకు చెందిన సరిత అలియాస్ ప్రత్యూష డాక్టర్ ప్రత్యూష ఐఏఎస్‌గా చలామణి అవుతూ పలు చోట్ల యువకులను మోసం చేసేది. ఏడాది క్రితం ఓ వైద్యుడిని బెదిరించి రూ.5లక్షలు వసూలు చేసింది. అదేవిధంగా సరితపై మలక్‌పేట, చైతన్యపురి, ఉప్పల్, నల్లగొండ టూటౌన్, మిర్యాలగూడ వన్‌టౌన్ పరిధిలో పలు చోరీ కేసుల, చైతన్యపురి, ఉప్పల్, నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చీటింగ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థిని ముసుగులో హాస్టల్స్‌లో ఉంటూ అమ్మాయిల దగ్గర నగదు, మొబైల్స్‌ను చోరీ చేసేదన్నారు. ఒకవైపు ఐఏఎస్‌నంటూ, మరొక చోట డీఎస్పీ కూతురునంటూ, డీఎస్పీ సతీమణి అంటూ అమాయకులను మోసం చేసేదన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సరితపై కేసులను నమోద చేసి ఆమె వద్ద ఉన్న ఐదు సెల్‌ఫోన్లను స్వాదీనం చేసుకోని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

# ప్రభుత్వ భూములు కాపాడాలని ధర్నా

**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలోని తీదేడు గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ ఊరి గ్రామస్తులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సర్వే నెంబర్ 3లో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వ భూమిని కాపాడి, ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తీదేడు గ్రాస్తులు తహసీల్దారుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వీరమళ్ళ భిక్షపతి, వెంకటయ్య, సత్తయ్య, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, రాములు, రాము, పరమేశ్, గోవర్ధనాచారి తదితరులు ఉన్నారు.

